అడ్మిన్‌లూ .. అప్రమత్తం..

- అమలులోకి ఎన్నికల కోడ్
- సోషల్ మీడియాపై పోలీసుల నిఘా
- తప్పుడు ట్రోలింగ్‌లు చేస్తే కఠిన చర్యలు



కంబాలచెరువు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దాని చాలా కట్టుదిట్టంగా అధికార యంత్రాంగం అమలు చేస్తోంది. రాజకీయ పార్టీల ప్రచారాలు, సమావేశాలు, సభలు తదితర వాటికి కూడా అనుమతులు తప్పనిసరి అని తేల్చిచెప్పింది. ఇదే సమయంలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్ వంటి సోషల్ మీడియా మాధ్యమాలపై పోలీసు శాఖ దృష్టి సారించింది. వాటిలో ఏవైనా అసభ్యకర ట్రోలింగ్‌లు, తప్పుడు ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటుంది. ఈ నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూప్‌ల అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఏ గ్రూపులో ఇలాంటివి జరిగినా అడ్మిన్లతో బాధ్యత అని స్పష్టం చేసింది. వారు ఏమాత్రం జాగ్రత్త వహించకపోతే కటకటాల పాలవ్వక తప్పదు. తప్పుడు వార్తల ప్రచారాలు, ట్రోలింగ్‌లు చేస్తే ఐపీసీ 153 (ఏ) సెక్షన్ కింద ఐదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్టీ కార్యకర్తలు, వారి అనుచరులు, ఎవరైనా సరే సోషల్ మీడియా వేదికగా చేసుకుని అవతలి వారిని దుర్భాషలాడుతూ, మహిళలను కించపర్చేలా పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు పోలీసు శాఖ ఉత్తర్వులు వెలువరించింది.

సోషల్ మీడియా అడ్మిన్ల బాధ్యతలు

- వాట్సప్, ఫేస్‌బుక్ వంటి గ్రూప్‌లో ప్రతి పోస్టుకీ అడ్మిన్ బాధ్యత తీసుకోవాలి
- గ్రూప్‌లో యాడ్ చేసే ప్రతి సభ్యుడూ తప్పకుండా అతడికి తెలిసి ఉండాలి.
- అభ్యంతరకర, తప్పుడు వార్త, వదంతులపై స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలి.
- ఎవరైనా సభ్యులు అభ్యంతకరంగా ప్రవర్తిస్తే వెంటనే గ్రూప్ నుంచి తొలగించాలి.
- వివాదాస్పద పోస్టింగ్‌పై అడ్మిన్ ఏ చర్యలూ తీసుకోకుంటే అతడిపై పోలీసులు చర్యలు తీసుకుంటారు.
- అడ్మినే వివాదాస్పద పోస్టు చేస్తే ఐటీ చట్టం, ఐపీసీ సెక్షన్ 153(ఎ) కింద శిక్ష విధిస్తారు. వారికి మూడు నుంచి ఐదేళ్ల వరకూ జైలుశిక్ష పడే అవకాశముంటుంది.

షేర్ చేయకూడని అంశాలు

- విద్వేషాలు రెచ్చగొట్టే వార్తలు
- తప్పుడు సమాచారం
- తెలియని సమాచారం
- వర్గపోరుకు దారి తీసేవి
- మార్ఫింగ్ చేసిన ఫొటోలు
- తప్పుదారి పట్టించే సమాచారం

కేసులు నమోదు చేసే సెక్షన్లు ఇవే..

ఆన్ లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్, సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ఈ క్రింది సెక్షన్లలో కేసులు నమోదు చేశారు.

67 ఐటీ యాక్ట్

ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్‌లకు పాల్పడితే ఈ సెక్షన్ కింద గరిష్టంగా ఐదేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు.

ఐపీసీ సెక్షన్ 354

ఉద్దేశపూర్వకంగా ఒక మహిళను లక్ష్యంగా చేసుకొని వేధించడం, సోషల్ మీడియా వేదికల ద్వారా అదే పనిగా సంప్రదించడం, వెంటపడడం, దూషించడం, అవమానించడం, వేధించడం వంటి వాటిని తీవ్రమైన నేరాలుగా పరిగణిస్తారు. ఈ సెక్షన్ కింద గరిష్టంగా ఐదేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా కూడా విధిస్తారు.



రెచ్చగొట్టే వారిని గుర్తిస్తాం

సామాన్యులను లక్ష్యంగా చేసుకొని సోషల్ మీడియాలో చేసే వేధింపులు, ట్రోలింగ్‌లను తీవ్రంగా పరిగణిస్తాం. అసభ్యకర, రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్న వారు ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటాం. ట్రోలింగ్‌లు చేస్తూ సోషల్ మీడియా యూజర్లకు తప్పుడు సమాచారం చేరవేస్తే వారి ఐపీ అడ్రస్ ద్వారా గుర్తించి కేసు నమోదు చేస్తాం. సైబర్ బుల్ షీట్లను తెరిచి దర్యాప్తు ముమ్మరం చేసి, చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం.

– పి.జగదీష్, జిల్లా ఎస్పీ

క్లుప్తంగా

ఘనంగా అఖండ హరినామ సంకీర్తన



సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

ప్రకాశం నగర్: ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో గౌరపూర్ణమి (హోలీ) సందర్భంగా ఆదివారం అఖండ హరినామ సంకీర్తన నిర్వహించారు. నగర సంకీర్తనతో గోదావరి నదీ జలపూర్ణ కలశం స్థాపనతో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమం సోమవారం ఉదయం 9 గంటల వరకూ కొనసాగుతుంది. శ్రీకృష్ణ చైతన్య మిషన్ డిప్యూటీ సెక్రటరీ అండ్ టెంపుల్ ఇన్‌చార్జి శ్రీపాద హరిదాసు బ్రహ్మచారి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. కాగా.. శ్రీ చైతన్య మహాప్రభు 537వ ఆవిర్భావ మహోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం 7 గంటల నుంచి పంచామృత ఫలపుష్పాలతో స్వామివారికి విశేష అభిషేకాలు చేయనున్నారు.

28న పార్సిళ్ల బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని పార్సిల్ కార్యాలయం వద్ద ఈ నెల 28వ తేదీ ఉదయం 11.30 గంటలకు అన్‌క్లైమ్‌డ్ పార్సిళ్లకు (ఎవ్వరూ తీసుకెళ్లకుండా వదిలేసిన పార్సిళ్లు) బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ మాధవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలవారు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చునన్నారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవాలు



కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్రకాశం నగర్: మెయిన్ రోడ్డులోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో ఐదురోజుల పాటు జరిగే ద్వాదశ (12వ) వార్షిక కుంభాభిషేక మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అద్దంకి వేంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు నిర్వహణలో మైలవరపు నారాయణ బ్రహ్మత్వంలో దెందులూరి శ్యామ్ కుమార్ అర్చకత్వంలో జరుగుతున్నాయి. ఉదయం 6 గంటలకు నుంచి విఘ్నేశ్వర పూజతో ప్రత్యేక పూజలకు శ్రీకారం చుట్టారు. శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ అధినేత రావిపాటి మదన గోపాలస్వామి సైతం దీక్ష తీసుకుని కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీహరే శ్రీనివాస భజన మండలి వాకచర్ల భద్రమ్మ బృందం మానుమాన్ చాలీసా పారాయణ చేసింది. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకూ పూజలు జరిపారు. రాత్రి 8 గంటలకు సాయి సేవకుడు పొక్కులూరి రామమూర్తి శ్రీ షిర్డీసాయి లీలలపై ప్రవచనం నిర్వహించారు. అనంతరం మల్లాది నరసింహారావు శాస్త్రీయ గాత్ర కచేరి అలరించింది.

ఆక్యూ ప్రెజర్ సేవలకు శ్రీకారం



ఆక్యుప్రెజర్ ట్రీట్ మెంట్ చేస్తున్న వైద్యుడు

రాజమహేంద్రవరం సిటీ: ఆక్యూ ప్రెజర్ ట్రీట్‌మెంట్ ద్వారా ప్రజలకు సేవలు అందించేందుకు రోటరీ క్లబ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ శ్రీకారం చుట్టిందని ఆ క్లబ్ అధ్యక్షుడు తీగల రాజా తెలిపారు. కోరుకొండ రోడ్డులోని రాజా థియేటర్ పక్కనే గల రిలయన్స్ స్మార్ట్ పాయింట్ బిల్డింగ్ మొదటి అంతస్తులో ఆదివారం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ న్యాయవాది, రొటేరియన్ మద్దూరి శివ సుబ్బారావు ప్రారంభించారు. తీగల రాజా మాట్లాడుతూ ఆక్యూ ప్రెజర్ చైనాకు చెందిన ఎంతో పురాతనమైన వైద్యమన్నారు. ఈ వైద్యం ద్వారా మన శరీరంలోని అనేక అనారోగ్య సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. నొప్పులతో బాధపడుతున్న వారికి ఉపశమనం లభిస్తుందన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాతలను అభినందిస్తున్న అనుశ్రీ సత్యనారాయణ, ఏడిద బాబీ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ నటుడు రామ్ చరణ్ జన్మదిన వేడుకలలో భాగంగా ఆదివారం రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో స్థానిక ధన్వంతరి బ్లడ్ బ్యాంక్ లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు, జనసేన అర్బన్ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ హాజరై, రక్తదాతలకు అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో సుమారు 91 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో నగర చిరంజీవి యువత అధ్యక్షులు కొత్తపేట రాజా, వాసపల్లి అంజి, నాళం వరప్రసాద్, దొడ్డి జానీ, ఎస్‌కే బాబా పాల్గొన్నారు.

క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు



విజేత జట్టుతో షర్మిలారెడ్డి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: క్రీడల ద్వారా యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. కాతేరులోని భరత్ నగర్ మైదానంలో భరత్ నగర్ యూత్ ఆధ్వర్యంలో జరిగిన కాత్రు అనిల్ (ఫ్రాన్సిస్) మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన షర్మిలారెడ్డి టోర్నమెంట్ విజేత భరత్ నగర్ యూత్, రన్నర్స్ నందరాడ యూత్ టీం సభ్యులకు ట్రోఫీలు, నగదు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు యెజ్జు వాసు, నిర్వాహకులు గోపి దోనేపాటి, చీకట్ల కిరణ్, సునీల్, రంజిత్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

జగన్ సంక్షేమ పాలనకు ప్రజల ఆదరణ

- ఎంపీ, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్
- వైఎస్సార్ సీపీలో వంద మంది చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన యువకులతో ఎంపీ భరత్ రామ్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో చెల్లుబోయిన నరేన్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల ఆదరణ పెరుగుతోందని, టీడీపీ, జనసేన పార్టీల నుంచి అనేక మంది వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని శేషయ్యమెట్టలో మాజీ కార్పొరేటర్ వాసంశెట్టి గంగాధరరావు, వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి మల్లాది ఉదయ్ రాణా ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులకు కండువాలు వేసి ఆహ్వానించారు.

సర్వాంగ సుందరంగా నగరం

ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలో 41 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా రాష్ట్రాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. జగనన్న సహాయంతో ప్రత్యేక నిధులు తీసుకువచ్చి నగరాన్ని సర్వాంగ సుందరంగా తయారు చేశామన్నారు. ఆ అభివృద్ధిని చూసి తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ నిరంతరం ప్రజల కోసం కష్టపడే నాయకుడు భరత్‌రామ్ అని కొనియాడారు. వచ్చే ఎన్నికల్లో ఆయనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందన్నారు. టీడీపీ, జనసేన పార్టీల నుంచి తోట రాము, బసవరాజు, విశాఖ ఆధ్వర్యంలో 34వ డివిజన్‌కు చెందిన సుమారు 100 మంది యువకులు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పోలు విజయలక్ష్మి, గూడూరి రాధిక, నగర యువజన విభాగం అధ్యక్షుడు పీతా రామకృష్ణ పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో నాయకులు

జగన్ పాలనలో అందరి సంక్షేమం : నరేన్

రాజమహేంద్రవరం రూరల్: సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకూ మేలు జరిగిందని వైఎస్సార్ సీపీ నాయకుడు చెల్లుబోయిన నరేన్ అన్నారు. హుకుంపేట డిబ్లాకులోని ఆంజనేయస్వామి, వినాయకుడి, గుబేల్ పేటలలో ఆదివారం సాయంత్రం జరిగిన సమావేశాల్లో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సుమారు 500 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ నాయకులు తెలగారెడ్డి శ్రీను, శ్రీరంగం లక్ష్మణరావు, నామాల సుశీల, మచ్చా దుర్గాప్రసాద్, షేక్ బాజీ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేనల నుంచి చేరిన వారికి చెల్లుబోయిన నరేన్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో పాలకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేసే మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరారు. హుకుంపేట డిబ్లాకులో సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాసంశెట్టి విక్రమ్, తోట దుర్గాప్రసాద్, దాని సతీష్, ఆకుమర్తి చింతారావు తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: వైఎస్సార్ సీపీ నాయకులు ఎల్‌వీ ప్రసాద్, లాలం శ్రీదేవి ఆధ్వర్యంలో ఆదివారం ధవళేశ్వరం ఇండస్ట్రియల్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, జేసీఎస్ కన్వీనర్ తాటికొండ విష్ణుమూర్తి, జయప్రకాష్, ప్రొఫెసర్ నాగేశ్వరరావు తదితరులు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్ సీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో తలారి ప్రసాద్, గోలి దేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, ముత్యాల జాన్, నంబూరి రవి, మద్దాల దుర్గాప్రసాద్, దేవదాసు రమేష్, విప్పర్తి విజయ్ కుమార్, పసుపులేటి దేవి, అమ్ములు, చప్పిడి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత జగన్



వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలతో రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: సంక్షేమ ప్రదాత సీఎం జగన్ అని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ (రుడా) రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. స్థానిక 29వ డివిజన్ కొత్తపేటలో ఆదివారం తెలుగుదేశం పార్టీ నుంచి పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రౌతు మాట్లాడుతూ ఎంపీ భరత్‌రామ్ నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారన్నారు. సీఎం జగన్ నగరంలో పేదలకు 40 వేల ఇళ్ల పట్టాలు మంజూరు చేయడం వెనుక భరత్ కృషి ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ ఇన్‌చార్జి కురుమెల్లి శాంతి స్వరూప్, అదనపు ఇన్‌చార్జి సేపేని మునీశ్వర్, వై.ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

వైభవంగా గోగులమ్మ-భూలోకమ్మల జాతర

అనపర్తి: మండలంలోని మహేంద్రవాడ గ్రామ దేవతలు గోగులమ్మ-భూలోకమ్మవార్ల జాతర, తీర్థం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గ్రామ దేవతలుగా మహేంద్రవాడ గ్రామస్తుల పూజలందుకుంటున్న అమ్మవార్లకు ఏటా ఉగాదికి ముందు వచ్చే పౌర్ణమి రోజున ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

- రూరల్ నియోజకవర్గ ఆర్‌ఓ, జేసీ తేజ్ భరత్



రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందని రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారం, రోడ్డుషోలు, ర్యాలీలు, సభలు, సమావేశాలకు, మైక్‌లో ప్రచారానికి 48 గంటలకు ముందు అనుమతి తీసుకోవాలన్నారు. అందుకోసం సువిధ యాప్‌లో ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత పత్రాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు. ఆ ప్రకారం..

- సమావేశాలు/ఊరేగింపులో ఎంతమంది పాల్గొంటారు, ఎన్ని వాహనాలు ఉపయోగిస్తారో తెలియజేస్తూ ఆయా వాహనాల నంబర్లు అందజేయాలి. ఎన్ని మైకులు వాడతారు, ఏ మార్గంలో వెళతారో కూడా వివరాలు తెలపాలి. సందేహాలను నివృత్తి చేసుకునేందుకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, రాజమహేంద్రవరం రూరల్ తహశీల్దార్ 98499 03860ను, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, కడియం తహశీల్దార్ 98499 03901ను సంప్రదించాలి.
- ఊరేగింపులో పాల్గొనే వాహనాల రికార్డులు, డ్రైవర్ల లైసెన్సుల వివరాలు కూడా దరఖాస్తుతో పాటు రిటర్నింగ్ అధికారికి అందజేయాలి. ఊరేగింపు రూట్ మ్యాప్ ముందుగానే ఇవ్వాలి. అందులో ప్రారంభించే ప్రదేశం, ర్యాలీని ముగించే ప్రదేశాలను తెలియజేయాలి.
- ఇంటింటి ప్రచారం కోసం ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. ఒకే గ్రామంలో, ఒకే సమయం కోసం రెండు లేదా అంతకంటే ఎక్కువ పార్టీలు అనుమతి కోసం దరఖాస్తు చేస్తే, ముందుగా దరఖాస్తు చేసిన వారికి అనుమతి మంజూరు చేస్తారు. మిగిలిన వారికి తేదీలను మార్చుతారు.
- ప్రార్థనా మందిరాలు, విద్యా సంస్థల దగ్గర ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు చేయరాదు. ఒకక పార్టీ నాయకులు, కార్యకర్తలు వేరొక పార్టీ సమావేశాలు, మీటింగ్‌లకు వెళ్లి ఆటంకం కలిగించకూడదన్నారు. కుల, మత, వర్గ పరమైన రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదు.
- రాత్రి 8 గంటల తర్వాత ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదు. కచ్చితంగా అనుమతి మంజూరైన తర్వాతే మాత్రమే అనుమతికి లోబడి కార్యక్రమాలు చేపట్టాలి. అందుకు విరుద్ధంగా ఎటువంటి కార్యక్రమం చేపట్టినా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఇచ్చే రిపోర్టు ఆధారంగా కేసు నమోదు చేస్తారు. ఆయా ఖర్చులను పార్టీకి లేదా అభ్యర్థి ఖర్చు కింద చూపడం జరుగుతుంది.
- రాజకీయ పార్టీలు, అభ్యర్థులు అందరూ తప్పనిసరిగా ముందస్తు అనుమతి పొందాలి.

చికిత్సతో క్షయ నివారణ సాధ్యమే



కడియంలో క్షయ నివారణ ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కడియం: మైకో బ్యాక్టీరియల్ అనే సూక్ష్మక్రిమి కారణంగా సంక్రమించే క్షయ వ్యాధిని చికిత్స ద్వారా సంపూర్ణంగా నివారించవచ్చునని కడియం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శివశంకర్ అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ జుట్టు, గోళ్లు మినహా శరీరంలో ఏ భాగానికైనా టీబీ సోకవచ్చునన్నారు. వ్యాధి నిర్ధారణ పరికరాలు కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయన్నారు. కఫం పరీక్ష, వ్యాధి నిర్ధారణ అనంతరం చికిత్సను పూర్తి ఉచితంగా అందిస్తామన్నారు. రోగికి పౌష్టికాహారం కోసం నెలకు రూ.500, పోషకాహార కిట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తుందని వివరించారు. టీబీ సూపర్ వైజర్ జి.శేషగిరిరావు మాట్లాడుతూ రెండు వారాల పాటు దగ్గు, జ్వరం, ఆకలి తగ్గిపోవడం, దగ్గినప్పుడు ఛాతీలో నొప్పి, రక్తం పడడం వంటివి క్షయ వ్యాధికి సూచికలన్నారు. కార్యక్రమంలో ముందుగా క్షయ నివారణ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు టీవీ శ్రీధర్, మోహన వంశీ, శిరీష, సందీప్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ యువజన అభ్యున్నతికి కృషి



సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: బ్రాహ్మణ యువజన అభ్యున్నతి కోసం బ్రాహ్మణ యువజన వృత్తి నిపుణుల సంస్థ (బైపా) పనిచేస్తుందని ఐటీ ప్రముఖుడు డాక్టర్ ఫణీంద్ర గొల్లపల్లి అన్నారు. నగరంలోని చందా సత్రంలో ఆదివారం తూర్పుగోదావరి బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యాచరణ సదస్సు నిర్వహించారు. డాక్టర్ ఫణీంద్ర మాట్లాడుతూ యువ బ్రాహ్మణ వృత్తిదారుల కోసం బైపా అనే సంస్థను ప్రారంభించామన్నారు. అన్ని రంగాల్లో బ్రాహ్మణ యువత ముందుకు దూసుకువెళ్లాలన్నారు. ఈ సందర్భంగా సంస్థ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాదిరాజు శ్రీనివాస్, సంస్థ కన్వీనర్ అజ్జరపు ప్రణవ్, సంఘం నగర అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ, జిల్లా మహిళా సంఘాల అధ్యక్షురాలు యేచూరి ప్రసన్న, ప్రధాన కార్యదర్శి కె.సూర్యకుమారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కలగ సుబ్రహ్మణ్యం, యువజన నాయకులు మల్లాది ఉదయ రాణా, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షురాలు డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

చర్చికి టీవీ, జనరేటర్ వితరణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పాతపేటలోని జేసీ చర్చికి విద్యుత్ కాంట్రాక్టర్ పెనుమళ్ళి సురేష్ రూ.లక్ష విలువైన 65 ఇంచెస్ టీవీ, జనరేటర్ వితరణ చేశారు. వాటిని ఆదివారం పాస్టర్ ఇశ్రాయేల్‌రాజుకు అందజేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

ప్రకాశం నగర్: ఆవరోడ్ మేకల కబేళా పక్కన గల బాబానగర్ మొదటి వీధి తాడితోట కరెంటు ఆఫీసు వద్ద కొంత కాలంగా విద్యుత్ మెయిన్ వైర్లు కిందకి వచ్చేసి అత్యంత ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. పాదచారులు, స్కూల్ పిల్లలు ఎక్కువగా సంచరించే ఈ దారిలో ఇలా ప్రమాదం పొంచి ఉండటంపై విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రి పూట లోడ్ లారీలు ఎక్కువ సంచరించే ఈ మార్గంలో రోజూ ఆ వైర్లను లారీలు లాక్కెళ్లిపోవడం వలన విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. గతంలో ఈ సమస్యను సీఎండీ గ్రీవెన్స్‌కు తీసుకు వెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. ఈ సమస్యని వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో సబ్ స్టేషన్ వద్ద ధర్నాకు దిగుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయం



దామిరెడ్డిపల్లిలో క్రైస్తవుల ప్రదర్శన



సీయోను ప్రార్థనా మహిమ మందిరం చిన్నారులు



రాజవోలులో టాటావిక్టర్ తదితరులు

కంబాలచెరువు: ఏసుక్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమని సీయోను ప్రార్థనా మహిమ మందిరం సంఘ కాపరి పి.ఎర్నెస్ట్ మోజెస్ అన్నారు. మట్టల ఆదివారం సందర్భంగా రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో సీయోను ప్రార్థనా మహిమ మందిరం ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. సండే స్కూల్ పిల్లలు ఏసుక్రీస్తు చెప్పిన శాంతి సందేశాన్ని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో డాక్టర్ గారపాటి ఎలిజబెత్, కవిత పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్: రాజవోలు క్రీస్తు కృపా సంఘం కాపరులు పి.టాటావిక్టర్, సుగుణ విక్టర్, యూత్ లీడర్ అభిషేక్ జాన్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. అలాగే మండలంలోని పలు చర్చిలలో ఈ కార్యక్రమం జరిగింది.

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమండ్రి బైబిల్ మిషను కెథడ్రాల్, గోల్డెన్ జూబ్లీ, స్వస్థత శాల మందిరాల సంయుక్త ఆధ్వర్యంలో మట్టల ఆదివారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ బిషప్ రెవరెండ్ డాక్టర్ ఎం.విజయరాజు ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో క్రైస్తవులు భారీ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎన్.సిమ్యోన్ సుదర్శన్, ఎన్.విలియం బెంటిక్, ఎస్.ఉషారాణి పాల్గొన్నారు.



ప్రార్థన చేస్తున్న విజయరాజు, క్రైస్తవులు

కడియం మండలంలో..

కడియం: మట్టల ఆదివారం పండగను మండలంలోని క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే వీధుల్లో మట్టలను చేతపట్టుకుని స్త్రీలు, యూత్, విశ్వాసులు పెద్ద ఎత్తున గ్రామ సంకీర్తనలు చేశారు. దామిరెడ్డిపల్లిలో బైబిలు మిషన్ మహిమ మందిరం నిర్వాహకుడు దేవరపల్లి రత్నరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సరోజిని, దేవరపల్లి కళ్యాణి ఫ్రాన్సిస్, కొండేటి ప్రసాద్, పందిరిరాజు, పాదూరి ప్రవీణ్, విజయ, వివేక్ పాల్గొన్నారు.